
ఈనాడు
వైయస్‌ఆర్
శనివారం అక్టోబరు 12, 2024 11


సిద్ధిధాత్రిగా కడప విజయదుర్గాదేవి దర్శనం


మైదుకూరులో గాయత్రీదేవిగా పెద్దమ్మ


వేములలో భువనేశ్వరిదేవిగా కన్యకాపరమేశ్వరి


కడప లలిత పంచాయతన ఆలయంలో మహిషాసురమర్దనిగా...


శ్రీవిజయదుర్గాదేవి ఆలయంలో కోలాటం ఆడుతున్న మహిళలు


అమ్మవారిశాలలో పిండితో తయారు చేసిన దున్నపోతును నరుకుతున్న పూజారి


కడప అమ్మవారిశాలలో భక్తుల సందడి

భయంకరి... శుభంకరి

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం మహర్నవమి సందర్భంగా జగన్మాత మహిషాసుర మర్దనిగా దర్శనమిచ్చారు. అష్టభుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంహరించింది ఈ రూపంలోనే. అందుకే ఇది నవదుర్గల్లో అత్యుగ్రరూపం. ఈ రోజున జగన్మాత కనకదుర్గమ్మ లేతరంగు దుస్తుల్లో సింహ వాహనాన్ని అధిష్టించి ఆయుధాలను ధరించి మహాశక్తిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాక్షసులకు సింహస్వప్నమైన ఆ శక్తి స్వరూపిణి భక్తుల పాలిట శుభంకరిగా దుర్గమ్మగా దర్శనమిచ్చారు. జిల్లావ్యాప్తంగా ప్రముఖ ఆలయాల్లో తేజోమయ రూపంలో జగజ్జననిని దర్శని చేసుకోవడానికి భక్తులు ప్రధాన ఆలయాల్లో బారులు తీరారు. ఆయా కార్యక్రమాల చిత్రాలివి.

- న్యూస్‌టుడే, కడప బృందం




ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌నాయుడు, బీటెక్ రవి,సీఎం సురేష్‌నాయుడులను సన్మానిస్తున్న బుశెట్టి రామ్మోహన్‌రావు, ఆర్యవైశ్య ప్రతినిధులు


కడప విజయదుర్గ ఆలయంలో బారులు తీరిన భక్తులు

దరఖాస్తుల కిక్కు!

◆ జిల్లా నుంచి 3,235 పత్రాలు దాఖలు
◆ రూ.64.70 కోట్లకు పైగా ఆదాయం

ఈనాడు, కడప, న్యూస్‌టుడే- కడప నేర వార్తలు: జిల్లాలోని 139 మద్యం దుకాణాలకు ఒక్కో దానికి సగటున దాదాపు 23 వంతున మొత్తంగా 3,235 దరఖాస్తులు అందాయి. దరఖాస్తుల ద్వారా రూ. 64.70 కోట్ల ఆదాయం రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చింది. దరఖాస్తుల గడువు శుక్రవారం సాయంత్రంతో ముగిసింది. జిల్లాలోని వివిధ సర్కిళ్ల పరిధిలో దుకాణాల నిర్వహణకు వ్యాపారులు పోటీపడ్డారు. ఒక్కో దరఖాస్తుకు దరావతు కింద రూ. 2 లక్షల చొప్పున రుసుం చెల్లించి టెండరుదారులు దరఖాస్తులు చేశారు. దరఖాస్తుల ఆధారంగా ఈనెల 14న లాటరీ విధానం కింద లైసెన్స్‌దారుల ఎంపిక కలెక్టర్ శివశంకర్ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరుగుతుంది. కొన్ని దుకాణాలకు తక్కువ సంఖ్యలో టెండర్లు దాఖలయ్యాయి. అక్కడ రాజకీయ ప్రమేయంతో ఎక్కువ మంది దరఖాస్తు చేయలేకపోయారనే అనుమానం వ్యక్తమవుతోంది. లాటరీ ద్వారా ఎంపికయ్యే దరఖాస్తుదారులు ఈ నెల 16 నుంచి దుకాణాలు నిర్వహించుకునే అవకాశం కల్పిస్తారు. మద్యం దుకాణాల వ్యవహారం జిల్లాలో తీవ్ర చర్చనీయాంశంగా ఉంది. వీటి కోసం పోటీ తీవ్రంగా కనిపించింది. అన్నమయ్య జిల్లా కంటే అధికంగా దరఖాస్తులు, ఆదాయం వచ్చింది. అర్ధరాత్రి 12 గంటల వరకు సమయం ఉండటంతో దరఖాస్తులు మరింత పెరిగే అవకాశం ఉందని ఆబ్కారీశాఖ అధికారులు భావిస్తున్నారు.


పొదల్లో పడేసిన ఔషధాలు


కాలం చెల్లని మందులు (2025 అక్టోబర్ వరకు గడువు ఉన్నా పడేశారు)

ముళ్లపొదల్లో ఔషధాలు

కాలం చెల్లని వాటినీ పడేసిన వైనం

పులివెందుల (వేముల), న్యూస్‌టుడే: మండలంలోని భూమయ్యగారిపల్లెలో ముళ్లపొదల్లో ఔషధాలు గుట్టలుగా పడేసి ఉండడం కలకలం రేకెత్తించింది. ఐరన్ పోలిక్ యాసిడ్ సిరప్‌లు, అల్బెంజడోల్, డోలో మాత్రలతో పాటు గ్లూకోజ్ బాటిల్స్ ఇందులో ఉన్నాయి. ఇందులో కొన్ని కాలం చెల్లినవి కాగా మరికొన్ని వాడుకోవాల్సినవి ఉన్నాయి. నిబంధనల ప్రకారం త్వరలో కాలం చెల్లడానికి అవకాశం ఉన్న మందులను సెంట్రల్ డ్రగ్స్ స్టోర్‌కు పంపించాల్సి ఉంటుంది. కాలం చెల్లినవి ఉంటే వైద్యాధికారుల పర్యవేక్షణలో సిరప్‌లు అయితే నీటిలో కలిపేసి పారబోస్తుంటారు. మాత్రలైతే తగిన ఉష్ణోగ్రతలో కాల్చి వేయాలి. కానీ... ఇలా గ్రామ సమీపంలోని ముళ్లపొదల్లో సంచులతో మందులు పడేయడం విమర్శలకు తావిస్తోంది. గ్రామ సచివాలయంలో విలేజ్ క్లినిక్ ఉండగా సిబ్బంది రోగులను పట్టించుకోరని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై వేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి శరణ్యను వివరణ కోరగా విషయం మా దృష్టికి రాలేదని.. మందులు పడేయడం సరైన పద్ధతి కాదన్నారు. బ్యాచ్ నంబర్ ఆధారంగా బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు.

మంగళూరు ఎక్స్‌ప్రెస్ మురడేశ్వర్ వరకు పొడిగింపు

కడప రైల్వే, న్యూస్‌టుడే : కాచిగూడ-మంగళూరు (12789/12790)ల మధ్య నడిచే వారాంతపు రైలును మురడేశ్వర్ వరకు పొడిగించినట్లు కడప రైల్వే సీనియర్ కమర్షియల్ ఇన్‌స్పెక్టరు ఎ.జనార్దన్ తెలిపారు. కాచిగూడలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో ఉదయం 6.05 గంటలకు రైలు బయలుదేరి జడ్చర్ల, మహబూబ్‌నగర్, కర్నూలు మీదుగా కడపకు మధ్యాహ్నం 2.25 గంటలకు చేరుకుంటుంది. అక్కడి నుంచి రేణిగుంట, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, కోయంబత్తూరు, మంగళూరు మీదుగా (బుధ/శనివారం) ఉదయం 9.30 గంటలకు, మురడేశ్వర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు వెళుతుంది. తిరుగు ప్రయాణంలో మురడేశ్వర్‌లో ప్రతి బుధ/శనివారం మధ్యాహ్నం 3.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు (గురు/ఆదివారం) మధ్యాహ్నం కడపకు 1.55 గంటలకు, అదే రోజు రాత్రి 11.40 గంటలకు కాచిగూడకు చేరుకుంటుంది.

అగ్రిసెట్‌లో జిల్లావాసికి మొదటి ర్యాంకు



దువ్వూరు, చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే : ఆచార్య ఎన్.జి. రంగా వ్యవసాయ విద్యాలయం 2024-25 విద్యా సంవత్సరంలో వ్యవసాయ బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన అగ్రిసెట్‌లో వైఎస్సార్ జిల్లా దువ్వూరు మండలం ఏకోపల్లె గ్రామానికి చెందిన పంగా **రామ వెంకట సుభాష్** అనే విద్యార్థి ఉత్తమ ప్రతిభ కనబరిచారు. అగ్రిసెట్ ఫలితాలు గురువారం రాత్రి వర్సిటీ విడుదల చేసింది. వ్యవసాయ డిప్లొమా కోర్సులో 120 మార్కులకు 115 సాధించి మొదటి ర్యాంకులో నిలిచారు. ఈ విజయం సాధించడంపై విద్యార్థి తల్లిదండ్రులు పంగా చిన్న సుబ్బరాయుడు, గంగాదేవి, గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

కొత్తపల్లెకు బస్సు సౌకర్యం కల్పిస్తాం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే: శ్రీకోడూరు దుర్గాంబాదేవి ఆలయం మీదుగా బాకరాపేట-పి. కొత్తపల్లె గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే స్వగ్రామ సమీపంలోని దుర్గాంబాదేవి అమ్మవారిని శుక్రవారం పుట్టా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు అందుకున్నారు. అనంతరం వృషభ రాజాల రాతిదూలం లాగు పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దుగ్గిరెడ్డి బసిరెడ్డి, సుబ్బారెడ్డి, శ్రీనువాసులరెడ్డి, పోలిరెడ్డి, తెదేపా నాయకులు పాల్గొన్నారు.


బండలాగు పోటీలు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్

బ్రహ్మంసాగర్‌కు నీరు చేరిక

మైదుకూరు : తెలుగగంగ ద్వారా శుక్రవారం నాటికి బ్రహ్మంసాగర్ జలాశయానికి 5.7 టీఎంసీల నీరు చేరాయి. ఆగస్టు 30న జలాశయంలో నీరు ప్రవేశించగా ప్రస్తుతం జలాశయంలో 6.5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయి. జిల్లా సరిహద్దులో 2600 క్యూసెక్కుల ప్రవేశిస్తూ ఉండగా బ్రహ్మంసాగర్ జలాశయంలోకి 1500 క్యూసెక్కులు చేరుతున్నట్లు ఏఈ సాయి తెలిపారు. ఎడమ కాలువకు 400 క్యూసెక్కులు, కుడికాలువకు 150 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.

చురుగ్గా అన్న క్యాంటీన్ నిర్మాణ పనులు

- న్యూస్‌టుడే, మైదుకూరు

పేదల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ భవన నిర్మాణ పనులు మైదుకూరు చురుగ్గా సాగుతున్నాయి. రెండు విడతల్లో జిల్లాలో పలుచోట్ల ప్రారంభించగా మైదుకూరులో వీలైనంత త్వరగా ప్రారంభించే ఆలోచనతో అడుగులు వేస్తున్నారు. తెదేపా హయాంలో రూ.40లక్షలతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఎన్నికలతో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో నిర్మాణ పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఐదేళ్ల వైకాపా పాలనలో పట్టించునే వారే కరవయ్యారు. తిరిగి తెదేపా ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అన్న క్యాంటీన్లను పునరుద్ధరించారు. మైదుకూరులో ఆగిపోయిన భవన నిర్మాణ పనులకు రూ.27.50 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. మరో రూ.25 వేలు అవసరం కావడంతో పురపాలక సాధారణ నిధుల నుంచి గుత్తేదారుకు చెల్లించేలా కౌన్సిల్ సమావేశం తీర్మానం చేసింది. భవన నిర్మాణ పనుల పూర్తికి గుత్తేదారు చకచకా అడుగులు వేస్తున్నారు.


మైదుకూరులో సిద్ధమవుతున్న అన్న క్యాంటీన్

మేమున్నాం... మీకు తోడుగా..

(10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966349431
జమ్మలమడుగు : 9000409516
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

స్పందనకు వందనం

బద్వేలు : పురపాలక సంఘ పరిధిలోని విద్యానగర్‌లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా ట్రాన్స్‌కో ఏడీఈ కుళాయప్ప ఆదేశాల మేరకు.. ఆ శాఖ సిబ్బంది చర్యలు తీసుకుని పరిష్కరించారు. ఆదివారం వార్తాంశం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు.

బద్వేలు : పట్టణంలో బ్రహ్మంసాగర్ నీరు వదిలినప్పుడు ట్యాపులు లేక నీరు వృథాగా పోకుండా కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశానుసారం ఆ శాఖ సిబ్బంది కుళాయిలు ఏర్పాటు చేశారు.

బద్వేలు : పురపాలకలోని డివైడర్లకు ఆనుకుని పేరుకుపోయిన ఇసుక వ్యర్థాలను కమిషనర్ నరసింహారెడ్డి ఆదేశాల మేరకు సిబ్బంది తొలగించారు. ఆదివారం వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు.

?: రాజుపాళెం మండలంలోని వెలవలి గ్రామంలో గతంలో ఉండే మరుగుదొడ్డి కూల్చివేసిన ప్రదేశంలో చెత్తా చెదారం కుప్పలుగా వేశారు. దీంతో ఇక్కడ దిబ్బ తయారై దోమలకు నిలయంగా మారింది. ఇక్కడ చెత్తచెదారం తొలగించండి. - బాషా, వెలవలి

?: రాజుపాళెంలోని కుందూనది రోడ్డులో సిమెంటు రోడ్డుపై చెత్తాచెదారం వేయడంతో వ్యర్థాలు పేరుకుపోయాయి. దీంతో పాదచారులకు ఇబ్బందిగా మారింది. ఇక్కడ పరిశుభ్రత చర్యలు చేపట్టాలి. - రాము, వెలవలి

✓: రోడ్డుపై, మరుగుదొడ్డి ప్రదేశంలో ఉన్న చెత్త నిల్వలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. - పై రెండు సమస్యలకు వెలవలి పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు సమాధానాలు చెప్పారు. - న్యూస్‌టుడే, రాజుపాళెం

?: ప్రొద్దుటూరు పట్టణం వరలక్ష్మీ అపార్ట్‌మెంట్ నుంచి రైల్వేస్టేషన్‌కు వెళ్లే దారిలో గడ్డి కయ్యల వద్ద ఉన్న ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం గుట్టల్లా పడింది. పాదచారులకు, వాహనదారులకు దుర్వాసన వస్తోంది. పంచాయతీ సిబ్బంది సకాలంలో తొలగించాలి.
- నాగిరెడ్డి, విశ్రాంత ఉపాధ్యాయుడు, ప్రొద్దుటూరు

✓ : చెత్తాచెదారాలను సకాలంలో తొలగించేందుకు చర్యలు తీసుకుంటాను. ప్రజలకు ఇబ్బందులు తొలగిస్తాం.
- రాజేంద్రనాథరెడ్డి, పంచాయతీ కార్యదర్శి, సోములవారిపల్లె పంచాయతీ కార్యదర్శి
- న్యూస్‌టుడే, ప్రొద్దుటూరు పట్టణం

హెచ్చరిక పలక... క్షతగాత్రులకు సూచిక



రహదారులపై ఇటీవల రోడ్డు ప్రమాదాల సంఖ్య గణనీయంగా పెరిగింది. క్షతగాత్రులకు సకాలంలో వైద్యసేవలు అందిస్తే ప్రాణాలతో బయటపడే అవకాశం ఉంది. రోడ్డు ప్రమాదం ఎక్కడ జరిగినా అందరిలో మదిలో మెదిలే నెంబరు 108. ఈ నెంబరే కాదు జాతీయ రహదారిపై ప్రమాదం ఎక్కడ జరిగినా 1033కి ఫోన్ చేయడం ద్వారా అత్యవసర సహాయం పొందవచ్చని అధికారులు విస్తృత ప్రచారం చేస్తున్నారు. - న్యూస్‌టుడే, మైదుకూరు

విద్యుత్తు స్తంభం... అల్లుకున్న నిర్లక్ష్యం

ముద్దనూరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద స్తంభాల విద్యుత్తు తీగలపై చెట్టు కొమ్మలు వాలాయి. ఇవి ఎంతో ప్రమాదకరంగా ఉన్నాయి. దీనివల్ల కరెంటు సరఫరాకు ఆటంకం కలగడమేకాకుండా ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ విషయమై విద్యుత్తు శాఖ ఏఈ వర్మను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తీగలపై ఉన్న చెట్టు కొమ్మలను తొలగించి ప్రమాదాలను నివారిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, ముద్దనూరు



రతన్ టాటా గొప్ప మానవతావాది

కొండాపురం, న్యూస్‌టుడే: విలువలు, మానవత్వంతో కూడిన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించిన మహోన్నతవ్యక్తి రతన్‌టాటా అని కొండాపురం మండలం బుక్కపట్నం గ్రామానికి చెందిన పలువురు యువకులు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ దేశ పారిశ్రామిక, వాణిజ్య రంగ పురోగతిలో రతన్ టాటా కీలకపాత్ర పోషించారని తెలిపారు. రతన్‌టాటా సేవలు చిరస్మరణీయమని వారు కొనియాడారు. ఆయన చిత్రపటానికి పూలమాలలతో విశ్వనాథ్, శివ, మోహన్, రంజిత్, నవీన్, వెంకటేష్, చంద్ర, ప్రసాద్, అంజి, బాలు, అశోక్ తదితరులు నివాళులర్పించారు.



రతన్‌టాటా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బుక్కపట్నం యువకులు

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సుధ

బద్వేలు, న్యూస్‌టుడే: బద్వేలులోని అమ్మవారిశాలను ఎమ్మెల్యే సుధ, పురపాలక వైస్‌ఛైర్మన్ వెంకటసాయికృష్ణ దర్శించారు. ప్రత్యేక పూజలను చేసి తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఆర్యవైశ్యవర్తక సంఘం అధ్యక్షులు సుబ్బారావు వారికి స్వాగతం పలికారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే: పట్టణ శివార్లలోని ప్రొద్దుటూరుకు వెళ్లే బైపాస్‌రోడ్డులో ద్విచక్ర వాహనంలో నుంచి అదుపుతప్పి కిందపడి ముద్దురెడ్డి దేవమ్మ (52) అనే మహిళ మృతి చెందినట్లు శుక్రవారం ఎర్రగుంట్ల పోలీసులు తెలిపారు. ముద్దురెడ్డి శివారెడ్డి, దేవమ్మ దంపతులది చాపాడు మండలంలోని మడూరు గ్రామం. దేవమ్మ తన తమ్ముడు మూలె నారాయణరెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంలో గండికి బయలుదేరారు. మార్గమధ్యలో ఎర్రగుంట్ల ప్రకాష్‌నగర్ వద్ద ద్విచక్రవాహనంలో నుంచి అదుపుతప్పి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. ఆమెను ప్రొద్దుటూరు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.


దేవమ్మ మృతదేహం

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీరామ్‌నగర్ కాలనీకి చెందిన శంకవరం రమేష్ (29) విష రసాయనం సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై కొండారెడ్డి తెలిపారు. రమేష్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా హైదరాబాద్‌లో పనిచేస్తున్నారు. తన వ్యక్తిగత కారణాలతో మానసికంగా వేదన చెందుతున్నారు. జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి విష రసాయనం సేవించి ఇంటి సమీపంలో పడిపోయారు. తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం గమనించగా అప్పటికే మృతి చెందారు.

అత్తపై అల్లుడి దాడి

అట్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని కోనరాజుపల్లెలో బాకీ విషయమై అల్లుడు రాయితో దాడి చేయగా కారుకు అద్దాలు పగిలి అత్తకు తలకు గాయాలయ్యాయి. బుధవారం రాత్రి కోనరాజుపల్లెలో జరిగిన ఈ సంఘటనపై ఎస్సై బి.రామకృష్ణ విచారించి గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. కోనరాజుపల్లెకు చెందిన అల్లుడు రమణారెడ్డికి కడపకు చెందిన అత్త రామసుబ్బమ్మ రూ.2 లక్షలు బాకీ ఉన్నారు. తల్లి బాకీ విషయమై కూతురు సరళను రమణారెడ్డి నిత్యం వేధిస్తున్నాడని తెలిసి రామసుబ్బమ్మ కోనరాజుపల్లెకు కారులో రాగా అక్కడ అల్లుడు అత్తపై దాడి చేశాడు.

యువతి అదృశ్యం

అట్లూరు, న్యూస్‌టుడే : మండలంలోని ఓ ప్రాంతానికి చెందిన ఓ యువతి అదృశ్యమయ్యారు. ఈమేరకు ఫిర్యాదు అందిందని పోలీసులు తెలిపారు. గురువారం రాత్రి నుంచి ఆమె కనిపించడం లేదన్నారు.

ఇసుక తరలిస్తున్న ఎడ్లబండ్ల పట్టివేత

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు సబ్ డివిజనల్ అటవీశాఖ కార్యాలయం పరిధిలోని రామేశ్వరం రిజర్వు అటవీ ప్రాంతంలో తవ్వి ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న 12 ఎడ్ల బండ్లను శుక్రవారం ఎఫ్‌ఆర్వో, డీఆర్వో హేమాంజలి, లక్ష్మీకుమారి పట్టుకున్నారు. అటవీశాఖ నిబంధనల ప్రకారం అటవీ ప్రాంతంలో ఇసుక తరలింపు చేయరాదని హెచ్చరించారు. వీటికి రూ.30 వేలు అపరాధరుసం కట్టించుకొని వదిలిపెట్టినట్లు వారు తెలిపారు.

దారంతా మడుగు... వేసేదెలా అడుగు?



మైదుకూరు-ప్రొద్దుటూరు రహదారి ఏటూరు కాల్వ బస్టాపు నుంచి రాజకొట్టాలుకు వెళ్లే రహదారిలో తరచూ ప్రమాదాలు పెరుగుతున్నాయి. క్షతగాత్రుల సంఖ్య పెరుగుతోంది. ఆరేళ్ల క్రితం రెండు కిలోమీటర్ల దూరం నాసిరకంగా తారురోడ్డు నిర్మాణం చేపట్టారు. రోడ్డు నిర్మించిన మూడు నెలలకే పెద్ద గుంతలుపడ్డాయి. తర్వాత ఎవరూ పట్టించుకోలేదు. చిన్నవర్షమొచ్చినా ద్విచక్రవాహన చోదకులు కిందపడిపోతున్నారు. ఇటీవల విజయనగరానికి చెందిన ఇద్దరు, రాజకొట్టాలకు చెందిన ఇద్దరికి గాయాలయ్యాయి. సమస్యపై ఇంజినీరు మధుసూదన్ బాబును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మరమ్మతులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, చాపాడు

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

రాయితీ శనగల పంపిణీకి ఏర్పాట్లు

రాజుపాళెం, న్యూస్‌టుడే: మండలంలోని రైతులకు ప్రభుత్వం రాయితీతో శనగలు సోమవారం నుంచి పంపిణీ చేస్తారని ఏవో శివశంకర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రైతుకు ఒక ఎకరాకు 40 కిలోల చొప్పున 5 ఎకరాల వరకు ఇస్తారని తెలిపారు.

దసరా పండుగ వేళ అధరహో!

రాజుపాళెం, న్యూస్‌టుడే: దసరా పండుగ సందర్భంగా మార్కెట్‌లో టమాటా ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. కిలో కూరగాయలు రూ.20 నుంచి రూ.50 వరకు పెరిగింది. నూనె రకాలు కిలోపై రూ.20 నుంచి రూ.40 వరకు పెరిగింది. టమాటా కిలో రూ.70 పలుకుతున్నాయి. ఇలా కంది, పెసర, శనగ బేడలు, చెక్కెర, ఉల్లి, ఉగ్గగడ్డలు ఇలా వంట సామగ్రి అవసరమైన వస్తువులు, నూనెల భారం కుటుంబంపై రూ.1000 దాకా అదనంగా పడుతోంది.

భగవద్గీత పుస్తకాల అందజేత

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: సబ్ జైలులోని ఖైదీల కోసం ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన 27 త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలు జైలర్ హర్షవర్ధన్‌కు అందజేసినట్లు ఇందూ జ్ఞానవేదిక జమ్మలమడుగు కమిటీ అధ్యక్షుడు రంగనాయకులు తెలిపారు. శుక్రవారం జైలర్‌ను కలిసి భగవద్గీతతోపాటు ఐనటువంటి ఆధ్యాత్మిక గ్రంథాలను ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సభ్యులు నరసింహ, నాగరాజు, వెంకటరెడ్డి, చలపతి, రమణ, మల్లేశ్వర్, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.





వెయిట్ లిఫ్టింగ్‌లో భీమునిపాడు యువకుడి సత్తా

దువ్వూరు, న్యూస్‌టుడే: దువ్వూరు మండలం భీమునిపాడు గ్రామానికి చెందిన జి.రవిశంకర్ అనే విద్యార్థి వెయిట్ లిఫ్టింగ్‌లో బంగారు పతకం సాధించారు. హిమాచల్‌ప్రదేశ్‌లో ఈనెల 10న జరిగిన జాతీయ స్థాయి 89 కేజీల జూనియర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మొదటి స్థానం సాధించి బంగారు పతకం సాధించడంపై విద్యార్థి తల్లిదండ్రులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



బంగారు పతకం చూపుతున్న రవిశంకర్

14 నుంచి పల్లె పండగ వారోత్సవాలు

చాపాడు, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద పల్లె పండగ వారోత్సవాలు ఈ నెల 14నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఏపీవో జగదీశ్వర్‌రెడ్డి తెలిపారు. మొత్తం 20 గ్రామపంచాయతీల్లో పనులు చేపట్టబోతున్నారు. 14న నాగులపల్లెలో ప్రారంభమై 20న వెదురూరులో ముగుస్తాయన్నారు. మొత్తం 49 పనులకు రూ.1.77 కోట్లతో సిమెంటు రోడ్లు, నాలుగు పాఠశాలల ప్రహరీలకు రూ.8.75 లక్షలు వెచ్చిస్తారని ఆయన వివరించారు.

వరుణుడి కరుణకు రైతుల ఎదురుచూపు

రాజుపాళెం, న్యూస్‌టుడే: రైతులు రబీ సీజను ప్రారంభం కావడంతో పంటలసాగుకు సిద్ధమవుతున్నారు. జిల్లాలో 3 లక్షల ఎకరాల వరకు పంటలు సాగు చేయొచ్చని ఉందని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. దీంతో వర్షం పడితే రైతులు శనగ, ఇతర పంటలు సాగు చేయాలనుకున్నారు. ఇప్పుడు పంటలసాగుకు వర్షం ఎంతో అనుకూలంగా ఉంటుందంటున్నారు. దీంతో మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారి శివ రామకృష్ణారెడ్డి తెలిపారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

కలసపాడు, న్యూస్‌టుడే: ప్రజలకు అంటువ్యాధులు ప్రబలకుండా అధికారులు చర్యలు చేపట్టాలని సీపీఐ ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్, మండల కార్యదర్శి సునీల్‌కుమార్ తెలిపారు. శుక్రవారం వారు కలసపాడులో విలేకరులతో మాట్లాడారు. కలసపాడులోని గ్రామంలో నుంచి నుంచి సగిలేరు ప్రధాన కాల్వ వరకు ఉన్న మురుగుకాల్వలు పూర్తిగా పూడిపోయాయన్నారు.






ఆరోగ్య కేంద్రం... పరిశుభ్రత కనం



మైదుకూరు పట్టణంలో శెట్టివారిపల్లెలోని పీహెచ్‌సీ పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగాయి. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్త, సచివాలయ ఆరోగ్య అధికారి అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. టీకాల కార్యక్రమం చేపడుతున్నారు. ఉప కేంద్రం పక్కనే పొలాలు ఉన్నాయి. వైద్య సేవల కొచ్చే రోగులు, గర్భిణులు, బాలింతలు, మహిళలు పరిసరాలను చూసి భయపడుతున్నారు. ఈ విషయమై డిప్యూటీ డీఎంహెచ్‌వో మల్లేష్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరాగా పరిసరాల బాగుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, మైదుకూరు**







మురుగు రహదారిపై పరుగు




ముద్దనూరు పట్టణంలోని ఎస్‌వి గిరికాలనీ వద్ద ఉన్న కాలువ నుంచి రహదారులపై మురుగు పారుతెందిజ దీంతో దుర్వాసన భరించలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. దీంతోపాటు దోమలూ విజృంభిస్తున్నాయి. విష జ్వరాల బారిన పడుతామేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ వీరభద్రుడిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా మురుగు కాలువ చుట్టూ బ్లీచింగ్‌తో పిచికారీ చేయిస్తామని అన్నారు. **- న్యూస్‌టుడే, ముద్దనూరు**





విద్యుత్తు తీగలకు మరమ్మతులు

చాపాడు : మండలంలోని మడూరు వ్యవసాయ పొలాల్లో ప్రమాదకరంగా ఉన్న 11 కేవీ. విద్యుత్తు తీగలకు మరమ్మతులు అధికారులు మరమ్మతులు చేశారు. గ్రామానికి చెందిన రైతు ఒకరు సమస్య చిత్రాలను సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేయడంతో అధికారులు స్పందించారు.













ప్రొద్దుటూరు
• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

ఘనంగా బిందె సేవ

జమ్మలమడుగు: స్థానిక ఓంకారేశ్వర దేవస్థానం నుంచి ఘనంగా బిందె సేవ, కలశ పూజ ఊరేగింపు కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీ భద్రావతి భావనారుషి దేవస్థానానికి సంబంధించి వంద మంది పద్మశాలీయులు ఆడపడుచులచే ఈ కార్యక్రమం కొనసాగింది. పలగాడి వీధి, సంజామల మోటు, పాత బస్టాండ్, గంగమ్మ దేవాలయం మీదుగా ఓంకారేశ్వర దేవస్థానం వరకు వేపరాల కోలాటం బృందంతో నిర్వహించారు. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి సతీమణి అరుణ హాజరుకాగా ఆలయ కమిటీ సభ్యులు సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పండగ రద్దీ

జమ్మలమడుగు గ్రామీణ, న్యూస్‌టుడే: దసరా పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వేస్టేషన్‌లు కిటకిటలాడాయి. బస్సుల కోసం, రైళ్లకోసం ప్రయాణికులు పడిగాపులు కాశారు. తారా అవి వచ్చాక సీట్ల కోసం ఎగబడ్డారు. జమ్మలమడుగులోని ముద్దనూరు, తాడిపత్రి, ప్రొద్దుటూరు బస్టాండ్ ప్రాంతాలు ఊళ్లకు వెళ్లే వారితో కిటకిటలాడింది.


రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

బాలికలను ప్రోత్సహించాలి

ప్రొద్దుటూరు పట్టణం: బాలికలను సమాజంలో ఉన్నతమైన స్థానంలో ఉండే విధంగా ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని వైద్యాధికారి డాక్టర్ బద్వేలి శివప్రసాదురెడ్డి అన్నారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం సర్వోదయ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ (సిర్డ్) ఆధ్వర్యంలో అనిబిసెంట్ పురపాలక ఉన్నతపాఠశాల ఆవరణంలో సమావేశాన్ని నిర్వహించారు. వైద్యుడు మాట్లాడుతూ కూతురంటే భారం కాదని ప్రతి కుటుంబం భావించాలన్నారు. ఆడ, మగలను ఇరువురిని సమానంగా చూడాలన్నారు. సిర్డ్ అధ్యక్షుడు ఎంవి సుబ్బారెడ్డి, కార్యదర్శి చెన్నమ్మ, సభ్యులు రమణమ్మ, గంగభవాని, ఆరోగ్యకార్యకర్తలు ఆశాలు పాల్గొన్నారు.

జగన్మాతా... నమోస్తుతే


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో గాయత్రీదేవి అలంకారంలో కన్యకా పరమేశ్వరీదేవి

నవరాత్రి వేడుకల్లో భాగంగా శుక్రవారం అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా అమ్మవారి దర్శనానికి బారులు దీరారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గ మండలాల్లోని ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు కుటుంబ సమేతంగా వచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు చర్యలు చేపట్టారు. -న్యూస్‌టుడే, క్లస్టరు బృందం


జమ్మలమడుగు నాగులకట్ట చౌడేశ్వరీదేవి ఆలయంలో శ్రీగాయత్రీదేవి అలంకారం


పోరుమామిళ్లలో బాలాత్రిపురసుందరీదేవి


బద్వేలులో రాజరాజేశ్వరీదేవీ అలంకారంతో భక్తులకు దర్శనమిస్తున్న అమ్మవారు


ప్రొద్దుటూరు చెన్నకేశవస్వామి దేవాలయంలో ధనలక్ష్మి అలంకారం


ప్రొద్దుటూరు అమ్మవారిశాలలో భక్తుల సందడి


దత్తాపురంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులు


ప్రొద్దుటూరు రతనాల వేంకటేశ్వరస్వామి ఆలయంలో...

దెబ్బతిన్న తూము... ఖాళీ అయిన జలాశయం

–న్యూస్‌టుడే, బ్రహ్మంగారిమఠం

దెబ్బతిన్న తూముకు సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడంతో నీటితో కళకళలాడాల్సిన జలాశయం ఖాళీ అవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. బ్రహ్మంగారిమఠం మండల పరిధిలోని ఎర్రంపల్లె గ్రామ సమీపంలో మడేరు రిజర్వాయర్‌కు ఈ దుస్థితి ఏర్పడింది. ఇటీవలి కాలం వరకు నీటితో ఉన్న ఈ జలాశయం నేడు వెలవెలబోయింది. మడేరు ఆయకట్టు, మలుగుడుపాడు, గొడ్లవీడు, మర్రంపల్లె, మరాటిపల్లె, చౌదరివారిపల్లె, నేలటూరు, పాటిమీదపల్లె గుండాపురం, బొగ్గులవారిపల్లెలలో సుమారు 2,500 ఎకరాల పొలాలకు సాగునీరు అందించే ఈ రిజర్వాయర్ నీటిని నిల్వ చేసుకోలేని పరిస్థితి దాపురించింది. ఆయకట్టు సాగులో ప్రస్తుతం వరి పండిస్తున్నామని ఇప్పుడు నీరు వృథాగా పోతే చేతికి పంట అందే పరిస్థితి కనిపించడంలేదని, తాము నష్టపోవాల్సి వస్తోందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. నీటిని నిలుపుకొనేందుకు రైతులు శుక్రవారం శాయశక్తులా చేసిన ప్రయత్నం ఫలించలేదు. దీంతో వ్యవసాయాన్నే జీవనాధారంగా నమ్ముకుని బతుకుతున్న కర్షకులు తల్లడిల్లిపోయారు. కళ్లెదుటే నీరు వృథా అవుతున్నా కనీసం అధికారులు కన్నెత్తి కూడా చూడలేదని వాపోతున్నారు. సమస్య తీవ్రతను తెలిపి ప్రత్యామ్నాయంగా ఏమైనా చేయాలని అధికారులకు విన్నవించినా ఎవ్వరూ రాలేదని ఆవేదన చెందుతున్నారు.

నీరు వృథా అవడంతో ఆయకట్టు రైతుల ఆందోళన


తూము నుంచి పోతున్న నీటిని చూపుతున్న రైతు


దెబ్బతిన్న తూము గేటును చూపుతున్న రైతులు

చెరువులకు సగిలేటి నీరు విడుదల

బి.కోడూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని సగిలేరు డ్యాం నుంచి ఎడమ కాలువ నుంచి శుక్రవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, జలవనరుల శాఖ అధికారులు ఈఈ వెంకట్రామయ్య, డీఈ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గేటును ఎత్తి నీటిని చెరువులకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే విజయమ్మ మాట్లాడారు. బి.కోడూరు మండల రైతులు, ప్రజలకు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం సాగు, తాగునీరు అవసరాలకు నీటిని విడుదల చేసిందన్నారు. నాయకులు రామచంద్రారెడ్డి, రమణారెడ్డి, ఏఈ కొండారెడ్డి, రామసుబ్బారెడ్డి, గోడి రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, బాలిరెడ్డి, గోడి ప్రతాప్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


నీటిని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, తెదేపా నాయకులు, అధికారులు

క్రిస్టియన్ భవన్‌కు నిధుల కేటాయింపుపై హర్షం

జమ్మలమడుగు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబుకు క్రైస్తవుల పట్ల విశ్వాసం ఉన్నందునే క్రిస్టియన్ భవన్‌కు రూ.10 కోట్లు కేటాయించారని తెదేపా క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు స్వామి దాసు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత తెదేపా ప్రభుత్వం హయాంలో గుంటూరు - విజయవాడ మధ్య భవన నిర్మాణం కోసం రెండు ఎకరాల స్థలం కేటాయించి రూ.16 కోట్లు నిధులు విడుదల చేశారన్నారు.


మాట్లాడుతున్న స్వామి దాసు, పక్కన నాయకులు

పండగవేళ ట్రాఫిక్ ఆంక్షలు

ప్రొద్దుటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: విజయదశమి సందర్భంగా ప్రొద్దుటూరులో శనివారం పుట్టపర్తి కూడలి నుంచి హౌసింగ్ బోర్డు పెద్దమ్మ చెట్టు వరకూ ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాల రాకపోకలకు అనుమతి లేదని ట్రాఫిక్ సీఐ దేవకిరణ్ తెలిపారు. బైపాస్ రోడ్డు మీదుగా వాహనదారులు రాకపోకలు సాగించాలని విజ్ఞప్తి చేశారు. పోలీసులకు సహరించాలన్నారు.

శుద్ధిజల పథకం... నిష్ఫలం

కొన్నేళ్ల కిందట రూ.3 లక్షలతో నిర్మించిన శుద్ధజల పథకం టేకూరుపేటలో ప్రారంభానికి నోచుకోలేదు. ఉన్నతాధికారులు స్పందించి ప్రారంభిస్తే ప్రజలకు తాగునీటి సమస్యలు తీరుతాయి. వీధి కుళాయిల నీటిని తాగడం వలన అనారోగ్యాలకు గురవుతున్నారు. ఈ నీటి శుద్ధి యంత్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రాజీవ్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, పోరుమామిళ్ల



అగ్రిసెట్‌లో మెరిసిన భవ్యశ్రీ



ఖాజీపేట, న్యూస్‌టుడే: అగ్రికల్చర్ బీఎస్సీలో ప్రవేశాల కోసం నిర్వహించిన అగ్రిసెట్-2024 ప్రవేశపరీక్షలో మండలంలోని తిప్పాయపల్లెకు చెందిన చంద్ర ఓబులరెడ్డి, నాగలక్షుమ్మల కుమార్తె వై.లక్ష్మీభవ్యశ్రీ (హాల్‌టికెట్ నెం. 40188111142) రాష్ట్రస్థాయిలో 28వ ర్యాంకు సాధించారు. నంద్యాలలోని ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో భవ్య అగ్రికల్చర్ డిప్లొమో చదివానని, వ్యవసాయ శాస్త్రవేత్తను కావాలన్నది తన ధ్యేయమని భవ్య తెలిపారు. ర్యాంకు సాధించడంపై కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



విశాఖపట్నం ఇన్నింగ్స్ విజయం


5 వికెట్లు తీసిన భానుస్వరూప్ | సెంచరీతో సత్తాచాటిన సాయికృష్ణ

కడప క్రీడలు, న్యూస్‌టుడే: ఏసీఏ అండర్-14 పురుషుల రెండు రోజుల క్రికెట్ టోర్నీలో భాగంగా శుక్రవారం కడప కేవోఆర్ఎం మైదానంలో జరిగిన మ్యాచ్‌లో కర్నూలుపై విశాఖపట్నం ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 295 వద్ద విశాఖ జట్టు ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అనంతరం 232 పరుగుల వెనుకంజతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 44 ఓవర్లలో 113 పరుగులకే ఆలౌటై ఇన్నింగ్స్, 119 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. విశాఖ బౌలర్లు భానుస్వరూప్ 5, వినోద్ 3 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. కర్నూలు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 63 పరుగులే చేసింది.

● కేఎస్ఆర్ఎం మైదానంలో తూర్పుగోదావరితో జరిగిన మ్యాచ్‌లో కడపకు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 159/4తో మొదటి ఇన్నింగ్స్ కొనసాగించిన కడప జట్టు 90 ఓవర్లలో 320/6 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. సాయికృష్ణ చైతన్య సెంచరీ (129*, 198 బంతుల్లో, 23×4), తాహీర్ 40 పరుగులు చేశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన తూ.గో.జట్టు చివరి రోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 198/7 స్కోరు చేసింది. కార్తీక్ 64, కృష్ణ సాకేత్‌రెడ్డి 53 పరుగులు చేశారు. తూ.గో. మొదటి ఇన్నింగ్స్ 151/10.

● వైఎస్ఆర్ఆర్-ఏసీఏ క్రికెట్ మైదానంలో ప్రకాశంతో జరిగిన మ్యాచ్‌లో చిత్తూరు మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధించింది. రెండోరోజు మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ప్రకాశం జట్టు 70 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటయింది. అనంతరం ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 88/3 స్కోరు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. చిత్తూరు మొదటి ఇన్నింగ్స్: 407/7 డిక్లేర్డ్.

నగరవనాన్ని మరింత అభివృద్ధి చేయండి

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కేంద్రం మొదటి విడతగా ఇచ్చిన రూ.1.40 కోట్లతో కడప నగరవనాన్ని మరింత అభివృద్ధి చేయాలని కర్నూలు ఇన్‌ఛార్జి కన్జర్వేటర్ యశోదబాయి పేర్కొన్నారు. ఆమె శుక్రవారం కడప డీఎఫ్‌వో సందీప్‌రెడ్డితో కలిసి కడప నగరవనాన్ని సందర్శించారు. యశోదబాయి మాట్లాడుతూ 2025 మార్చి నాటి కల్లా మొదటి విడత చేపడుతున్న అభివృద్ధి పనులు పూర్తి చేయాలన్నారు. కడప సబ్ డీఎఫ్‌వో స్వామి వివేకానంద, కడప అటవీక్షేత్రాధికారి ప్రసాద్, డిప్యూటీ రేంజి అధికారులు శ్రీపతి ఓబులేసు, మల్లికా తదితరులు పాల్గొన్నారు.


నగరవనాన్ని పరిశీలిస్తున్న కర్నూలు ఇన్‌ఛార్జి కన్జర్వేటర్ యశోదబాయి, డీఎఫ్‌వో సందీప్‌రెడ్డి తదితరులు

ముస్లింల నిరసన ప్రదర్శన

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే: మహమ్మద్ ప్రవక్త, ఖురాన్‌పై ఉత్తరప్రదేశ్‌కు చెందిన యతి నర్సింగ్ నంద అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ముస్లిం సోదరులు కడప ఏడురోడ్ల కూడలి వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం అక్కడ నుంచి ఒకటో పట్టణ ఠాణా వద్దకు వెళ్లి ఆవరణలో బైఠాయించారు. యతి నర్సింగ్‌నందపై కేసు నమోదు చేయాలని ఎస్సైకు వినతి పత్రం అందజేశారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు కదిలేది లేదని ముస్లిం సోదరులు ఠాణా ఆవరణలో బైఠాయించారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అక్కడే ఉన్నారు. ఒక దశలో ఠాణా లోపలకు వెళ్లేందుకు యత్నించారు. మతపెద్దలు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపు చేశారు. సాయంత్రం 4.30 గంటలకు డీఎస్పీ రమాకాంత్, సీఐ రామకృష్ణ వచ్చి, కేసు నమోదు చేస్తామని చెప్పినప్పటికీ వారు వినిపించుకోలేదు. ఎట్టకేలకు ఎఫ్ఐఆర్ నమోదు చేయడంతో అక్కడ నుంచి బయలుదేరారు. ఈ సందర్భంగా ముస్లిం మత నాయకులు బాబాభాయ్ మాట్లాడుతూ ఒక మతాన్ని విమర్శించడం సరికాదన్నారు. మహమ్మద్ ప్రవక్త గురించి అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. పలువురు ముస్లిం మతపెద్దలు, నాయకులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ముస్లిం మైనార్టీలు

14 నుంచి గ్రామీణ యువకులకు ఉచిత శిక్షణ

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈ నెల 14వ తేదీ నుంచి గ్రామీణ యువకులకు సెల్‌ఫోన్ రిపేరింగ్-సర్వీసింగ్, ఫొటోగ్రఫీ-వీడియోగ్రఫీల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టరు ఆరిఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ 30 రోజుల పాటు ఉంటుందన్నారు. 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సు గల వారు ఈ శిక్షణ పొందేందుకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాలకు చెందిన గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అందుబాటులో పొద్దుతిరుగుడు, కుసుమ విత్తనాలు

చింతకొమ్మదిన్నె, న్యూస్‌టుడే: మండలంలోని ఊటుకూరు ఏరువాక కేంద్రంలో నంద్యాల వ్యవసాయ పరిశోధన కేంద్రానికి చెందిన ఎన్‌డీఎస్‌హెచ్-1012 (ప్రభాత్) పొద్దుతిరుగుడు, ఐఎస్ఎఫ్-764 రకం కుసుమ విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు సమన్వయకర్త అంకయ్యకుమార్ తెలిపారు. ప్రొద్దుతిరుగుడు కిలో రూ.500, కుసుమ రూ.110కు విక్రయిస్తున్నామని, కావాల్సిన రైతులు తీసుకెళ్లవచ్చని చెప్పారు.

ప్రజలందరికీ విజయాలు కలగాలి: ఎస్పీ

కడప నేరవార్తలు : జిల్లా ప్రజలందరికీ విజయదశమి పండగ రోజు విజయాలు కలగాలని జిల్లా పోలీసు అధికారి హర్షవర్ధన్‌రాజు శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెడుపై మంచి సాధించిన విజయానికి సంకేతంగా విజయదశమిని ఇంటిల్లిపాదీ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE : KADAPA.
E.P. No. 45/2020 / O.S.No. 303/2016

Between: Paturu Subba Reddy @ Katuri Subba Reddy, S/o Veera Reddy, Resident of D.No. 6/461-4, Sankarapuram, Kadapa City. **- Petitioner/D.Hr.**

And

Nagam Abbireddy, S/o Yella Reddy, Resident of D.No. 40/48-5, Muthurasupalli, Kadapa City. **- Respondent / J.Dr.**

వేలం ప్రకటన

పై నెంబరు ఈపీలో ఈ క్రింద కనబరచిన షెడ్యూల్ దాఖలా ఆస్తిని వేలం వేయుటకు కోర్టువారు 01.11.2024న వాయిదా వేసి యున్నారు. ఆసక్తి గలవారు 01.11.2024న ఉదయం 10:30 గంటలకు పైన తెలిపిన కోర్టు నందు హాజరయి వేలం పాటలో పాల్గొనవచ్చునని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

SCHEDULE

Kadapa District, Kadapa Urban Sub Registration District, Municipal Corporation Area, Chinna Chowk Village, Survey No. 436/10, House site, Shown as ABEF in the petition plan in an extent of Ac. 0-5 3/4 cents out of Ac. 0-23 Cents, with in the following boundaries. **East** : Site of Mukkara Rama Krishna Reddy and Bellam Narasa Reddy, **West** : Government Land, **North** : Site of Janapati Yanadaiah and others, **South** : Site of Vasudeva Reddy.
Measurements : East-West : 54 feet on the Northern and Southern side, **North - South** : 46.3 feet on the Eastern & Western Side.

D.Hr Value : Rs. 17,25,000/-
Amin Value : Rs. 10,00,000/-
Govt. Market Value : Rs, 13,35,840/-
//By order of the Court//
P.R.Eswar Reddy,
Advocate for D.Hr, Kadapa.
























కడప

• కడప • పులివెందుల • కమలాపురం

సీసీ కెమెరాల మరమ్మతులకు ఆదేశం

స్పందనకు వందనం

పులివెందుల(లింగాల), న్యూస్‌టుడే: జిల్లాలో పనిచేయని సీసీ కెమెరాలు గుర్తించాలని జిల్లా పోలీస్ కార్యాలయం కంట్రోలు విభాగం నుంచి ఆదేశాలందాయి. ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ప్రమాదాలు, చోరీలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడం కష్టమవుతోందని 'ఈనాడు'లో బుధవారం 'మూడో కంట్లో నలుసు' శీర్షికన ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ప్రొద్దుటూరు, కడప పరిధిలో మినహా మిగతా పోలీసు స్టేషన్ల పరిధిలో పనిచేయని కెమెరాలకు మరమ్మతులు చేయాలని సూచించారు. పాడైన వాటిని వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టామని పులివెందుల గ్రామీణ సీఐ ఎన్‌వీ రమణ తెలిపారు.

ప్రభుత్వ భూములు నిరుపేదలకు పంచండి

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: ప్రభుత్వ భూములను నిరుపేదలకు పంచాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అన్వేష్, మండల కార్యదర్శి నరసయ్య డిమాండు చేశారు. ఒంటిమిట్టలో శుక్రవారం సీపీఎం గ్రామీణ మహాసభలో వారు మాట్లాడుతూ మండలంలో పెన్నపేరూరు, జౌకులపల్లిలో వందలాది ఎకరాలను రాజకీయ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని దర్జాగా కబ్జా చేశారని తెలిపారు. గత 12 ఏళ్లుగా అక్రమార్కుల గుప్పిట్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని పోరాటం చేస్తున్నా పట్టించుకునే వారు కరవయ్యారని విమర్శించారు. నాయకులు ప్రసాద్, నరసింహ, రామచంద్రుడు, సాంబయ్య, సురేష్‌బాబు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి



మాట్లాడుతున్న ప్రసాద్, వేదికపై సంఘం ప్రతినిధులు

కడప విద్య, న్యూస్‌టుడే : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం పెండింగ్ డీఏ, పీఆర్సీ బకాయిలన్నీ వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసాద్ డిమాండ్ చేశారు. స్థానిక సంఘం కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ పీఎఫ్ బకాయిలు సకాలంలో జమకాకపోవడంతో వడ్డీ నష్టపోతున్నామన్నారు. 2023 - 24 సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ వెంటనే ప్రాన్ ఖాతాలలో జమచేయాలని డిమాండ్‌చేశారు. రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు ఈశ్వరచంద్ర, ఉమాకాంత్, వీరప్రసాద్, పద్మజ, చంద్రశేఖర్‌రెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతంగా ముగిసిన 'ఆంధ్రప్రదేశ్ దర్శన్'



విశాఖ బీచ్ సమీపంలో విజయ చిహ్నం చూపుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

కడప విద్య, న్యూస్‌టుడే : జిల్లాకలెక్టర్ శివశంకర్ లోతేటి ఆధ్వర్యంలో విజన్ స్వర్ణాంధ్ర-2047లో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు చేపట్టిన విజ్ఞాన విహార యాత్ర విజయవంతంగా పూర్తయిందని జిల్లా విద్యాశాఖాధికారి అనురాధ అన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో శుక్రవారం ఆమె మాట్లాడుతూ ఈ నెల 4న ప్రారంభమైన యాత్రం శ్రీకాళహస్తి, శ్రీహరికోట, కొండవీడు, అమరావతి, పిఠాపురం, అన్నవరం, విశాఖపట్నం, సింహాచలం, అరకు, విజయవాడ తదితర ప్రాంతాల్లో సాగిందని వెల్లడించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం జిల్లాకు తిరిగి వచ్చారని చెప్పారు.

అక్రమాలపై విచారణ చేపట్టాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: ఇంటర్మీయట్ జిల్లా రీజినల్ జాయింట్ డైరెక్టర్‌పై వస్తున్న అవినీతి ఆరోపణలపై జిల్లా ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ జిల్లా కార్యదర్శి శివకుమార్ డిమాండు చేశారు. స్థానిక జిల్లా కార్యాలయంలో స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. నగర కన్వీనర్ విజయ్, వంశీ పాల్గొన్నారు.

నిరాధార ఆరోపణలు సరికాదు

కడప విద్య, న్యూస్‌టుడే: కొన్ని విద్యార్థి సంఘాలు తనపై చేస్తున్న నిరాధార ఆరోపణలు సరికాదని ఇంటర్మీడియట్ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్జేడీ) రవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ ఉద్యోగోన్నతుల తరువాత ఏర్పడిన ఖాళీల్లో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిబంధనల ప్రకారం అధ్యాపకుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టామని తెలిపారు. బోధనేతర ఉద్యోగులే అర్హత ప్రకారం ఉద్యోగోన్నతులు పొందారని ఎటువంటి అవకతవకలు జరగలేదని చెప్పారు.

తెగుళ్లపై జాగ్రత్తలు తప్పనిసరి

సిద్దవటం, న్యూస్‌టుడే : తెగుళ్ల నివారణపై రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని బద్వేలు వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు నాగరాజు తెలిపారు. సిద్దవటం మండలంలోని టక్కోలులో ఏటీఎం మోడల్ కింద ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో సాగుచేసిన చీనినిమ్మ పంటను శుక్రవారం పరిశీలించారు. ప్రతిరోజు పంట గమనిస్తూ సస్య రక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. సిబ్బంది వంశీ, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

కేసముద్రం, న్యూస్‌టుడే: తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం జరిగింది. కడపకు చెందిన భవన నిర్మాణ కార్మికుడు లక్క ప్రశాంత్(31) భార్య అమీనా, ఇద్దరు పిల్లలతో ఉపాధి కోసం నాలుగు నెలల కిందట పెనుగొండ గ్రామానికి వలస వచ్చారు. వీరితోపాటు అమీనా తల్లి, సోదరుడు కూడా వచ్చి అదే వీధిలో మరో ఇంట్లో ఉంటున్నారు. కుటుంబ కలహాల కారణంగా గురువారం రాత్రి దంపతులు గొడవపడ్డారు. శుక్రవారం ఉదయం అయిదు గంటల ప్రాంతంలో ప్రశాంత్ ఉరేసుకుని ఆత్మహత్యాయత్నం చేశారంటూ భార్య అమీనా, ఆమె కుటుంబ సభ్యులు అతడ్ని ఆటోలో మహబూబాబాద్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు అప్పటికే అతడు మృతి చెందినట్లు తెలిపారు. ఈ సంఘటనపై అనుమానాలు వ్యక్తం చేస్తూ వైద్యులు కేసముద్రం పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పరిశీలించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ప్రశాంత్ తలపై గాయాలుండడంతో హత్యగా అనుమానించి ఆ కోణంలో విచారణ కొనసాగిస్తున్నట్లు ఎస్సై మురళీధర్‌రాజు తెలిపారు.

కొండ చిలువ పట్టివేత



కొండచిలువను పట్టుకొన్న మధురెడ్డి

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: బిదినంచెర్ల గ్రామంలోని అరటి తోటలో కొండచిలువ కలకలం రేపింది. దీంతో రైతు వెంటనే అదే గ్రామానికి చెందిన మధురెడ్డి అనే యువకుడికి సమాచారం అందించడంతో అతను దానిని పట్టుకొని దూరంగా ఉన్న కొండప్రాంతంలో వదిలిపెట్టారు. పాములు కనిపిస్తే, వాటిని చంపకుండా తనకు సమాచారం ఇస్తే దానిని పట్టుకుని, దూరంగా తీసుకెళతానని మధురెడ్డి తెలిపారు.

వివాహిత ఆత్మహత్య కేసులో భర్త, అత్త అరెస్టు

చక్రాయపేట, న్యూస్‌టుడే: చక్రాయపేట మండలంలోని అద్దాలమర్రి గ్రామంలో ఈ నెల 7న తోళ్లపల్లె గంగాసుమతి అనే మహిళ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న కేసులో ఆమె భర్త తోళ్లపల్లె ప్రశాంత్, అత్త నాగలక్ష్మిలను సత్యసాయి జిల్లా తలపుల బస్టాండ్ వద్ద అదుపులోకి తీసుకున్నట్లు ఇడుపులపాయ సీఐ నాగరాజు శుక్రవారం తెలిపారు. వారిని రిమాండ్‌కు తరలించామన్నారు.

తూనికలు, కొలతలశాఖ అధికారుల దాడులు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : కడప లీగల్ తూనికలు, కొలతల శాఖ అధికారులు శుక్రవారం కడప నగరంలోని ఎరువులు, బియ్యం, హార్డ్‌వేర్, ఆటోమొబైల్, చౌక దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. మొత్తం ఆరు కేసులు నమోదు చేశారు. కడప లీగల్ మెట్రాలజీ అసిస్టెంట్ కంట్రోలర్ కేజే రవీంద్ర మాట్లాడుతూ వ్యాపారులు అమ్మే ప్రతి వస్తువుపై తయారీదారుల పూర్తి చిరునామా, గరిష్ఠ అమ్మకపు ధర, తయారీ తేదీ, కస్టమర్ కేర్ నెంబరు, ఈ-మెయిల్ అడ్రస్ కచ్చితంగా ఉండాలన్నారు. తూకాల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టరు రమేష్‌కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

సిద్దవటం, న్యూస్‌టుడే: సిద్దవటం మండలం కమ్మపాలెం గ్రామానికి చెందిన ఆటో ప్రయాణికులతో కడపకు వెళుతుండగా కనుమలోపల్లిలోని కోతుల వంక రహదారి వద్ద ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కమ్మపాలెం నివాసి ఓబులమ్మ గాయపడగా, చికిత్స నిమిత్తం ఆమెను కడపకు తరలించారు.

సింహాద్రిపురంలో వేడుకగా రథోత్సవం

సింహాద్రిపురం, న్యూస్‌టుడే: సింహాద్రిపురంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దసరా సందర్భంగా స్వామివారికి బ్రహ్మోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా స్వామివారి ఉత్సవ విగ్రహాలతో రథోత్సవాన్ని నిర్వహించారు. కోలాటాలు, భజనలు, డీజేలు అలరించాయి. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.



రథంపై ఊరేగుతున్న స్వామివారు



కోలాటం ఆడుతున్న కళాకారులు

శిల్పారామంలో దసరా సంబరాలు

మారుతీనగర్, న్యూస్‌టుడే: శిల్పారామంలోని కళావేదికపై శుక్రవారం దసరా మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మిస్పా మూవీ ఆధ్వర్యంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. జానపద, శాస్త్రీయ, సినిమా పాటలకు చిన్నారులు చేసిన నృత్యాలు అలరించాయి. నగర ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కార్యక్రమాలను వీక్షించారు. శిల్పారామం పరిపాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.




నృత్యాలు చేస్తున్న చిన్నారులు

యువతను ఆకట్టుకునేలా ద్విచక్ర వాహనాలు

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే: యువతరం మెచ్చేలా వస్తున్న ద్విచక్రవాహనాలు మార్కెట్‌లో వస్తున్నాయని, వారి కోసం ఏర్పాటు చేసిన హరూన్‌బజాజ్ మేళాకు విశేష స్పందన లభిస్తోందని మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా పేర్కొన్నారు. కడపలో శుక్రవారం బజాజ్ షోరూంలో కేటీఎం వాహనాన్ని కొనుగోలు చేసిన వినియోగదారుడికి ఆయన తాళాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అంజాద్‌బాషా మాట్లాడుతూ వాహనాలపై ప్రత్యేక బెనిఫిట్స్ అందుబాటులో ఉంచామని, యువతరం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.



వాహనాదారుడికి తాళాలు అందజేస్తున్న మాజీ డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా




దేవుని కడపలో శ్రీవారు



నబీకోటలోని చౌడమ్మ ఆలయంలో రాజరాజేశ్వరీదేవిగా



ఆకులవీధిలో మీనాక్షీదేవి అలంకరణలో



శ్రీలక్ష్మీ సత్యనారాయణ స్వామి ఆలయంలో మోహినీ అలంకరణలో



సింహాద్రిపురం: శ్రీరాజ రాజేశ్వరీదేవిగా అమ్మవారు



కమలాపురం: కనక మహాలక్ష్మి అలంకరణలో వాసవీమాత



ఒంటిమిట్టలో కన్యకా పరమేశ్వరిగా జగన్మాత

జయశుభకారిణి... విజయరూపిణి



ఎర్రముక్కపల్లె మారెమ్మ ఆలయంలో సరస్వతీదేవిగా...




సీకేదిన్నెలో మహిషాసురమర్దినిగా గంగమ్మ



సిద్దవటంలోని గాండ్లపాలెంలో అంకాలమ్మ

విజయదశమి శరన్నవరాత్రుల్లో భాగంగా శుక్రవారం మహర్నవమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. రాజరాజేశ్వరి, మహిషాసురమర్దని, వాసవీమాత తదితర రూపాల్లో అమ్మవారిని అలంకరించారు. ఈ సందర్భంగా ఆలయాలను సుందరంగా తీర్చిదిద్దారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. - న్యూస్‌టుడే, బృందం



నడిబీధి గంగమ్మ ఆలయంలో మహిషాసురమర్దిని...



వల్లూరు మీనాక్షీదేవిగా దర్శనమిస్తున్న కన్యకాపరమేశ్వరీదేవి



విజయదుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న మహిళలు



కడప అమ్మవారిశాలలో వాసవీమాత అలంకరణ



కమలాపురం: భక్తులకు అన్నదానం

హైదరాబాదుకు రూ.2250, విజయవాడకు రూ.2000

☛ ప్రైవేటు ట్రావెల్స్ నిలువు దోపిడీ ☛ చోద్యం చూస్తున్న రవాణాశాఖ

న్యూస్‌టుడే, కడప చిన్నచౌక్

తెలుగునాట పెద్దపండగల్లో దసరా ఒకటి. ఇతర రాష్ట్రాలు, జిల్లాల్లో ఉన్నవారందరూ కుటుంబంతో సంతోషంగా గడపడానికి సొంతూళ్లకు వస్తారు. పండగ అనంతరం తిరిగి బయలుదేరాలంటే మాత్రం వారికి భయం వేస్తోంది. అవసరాన్ని ఆసరాగా తీసుకుని ప్రైవేటు ట్రావెల్స్ వారు ఇష్టానుసారంగా ఛార్జీలు వసూలు చేస్తున్నారు. ఈ నెల 14న కడప నుంచి వెళ్లే ప్రైవేటు బస్సుల్లో హైదరాబాదుకు రూ.2250, విజయవాడకు రూ.2వేలు చొప్పున టిక్కెట్ ధర ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఇది వరకే ఆర్టీసీ బస్సులు, రైళ్ల రిజర్వేషన్ పూర్తి కావడంతో ప్రయాణికులు ప్రైవేటు బస్సుల వైపు దృష్టి సారించారు. కానీ ట్రావెల్స్ వారు దోపిడీ చేస్తుండటంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

కడప నుంచి ఇతర ప్రాంతాలకు ధరలివి		
ఊరు	ఆర్టీసీ	ప్రైవేటు ట్రావెల్స్
హైదరాబాదు	రూ.760	రూ.2250
విజయవాడ	రూ.740	రూ.2000
బెంగళూరు	రూ.550	రూ.2000
చెన్నై	రూ.480	రూ.1000

పట్టించుకోని అధికారులు: కడప మీదుగా హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగళూరుకు ప్రతి రోజూ సుమారు 50 నుంచి 60 వరకు ప్రైవేటు బస్సులు వెళ్తుంటాయి. వీటిల్లో కడప, ప్రొద్దుటూరు, తిరుపతి ప్రాంతాలకు చెందినవే ఎక్కువగా ఉన్నాయి. బెంగళూరు సాఫ్ట్‌వేర్ రంగానికి పెట్టింది పేరు కావడంతో ఎక్కువ మంది ప్రయాణికులు వెళ్తుంటారు. రవాణాశాఖ అధికారులు ప్రైవేటు ట్రావెల్స్ వారికి ఎలాంటి హెచ్చరికలు కానీ సూచనలు కానీ చేసిన దాఖలాలు లేవు. ఒక కుటుంబం వెళ్లాలంటే కనీసం రూ.10వేలు కేవలం ఛార్జీలకు వెచ్చించాల్సి వస్తుందని పలువురు వాపోతున్నారు.

తనిఖీలు చేస్తున్నాం

దసరా సందర్భంగా ప్రైవేటు ట్రావెల్స్ దాడులు నిర్వహిస్తున్నాం. ఇది వరకే యజమానులతో సమావేశం ఏర్పాటుచేశాం. జిల్లా వ్యాప్తంగా తనిఖీలు చేస్తాం. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తాం. ముఖ్యమైన మార్గాల్లో నిఘా ఉంచాం. **- మురళీ, బాధ్య ఆర్టీవో, కడప**

అటవీ చట్టాలపై అవగాహన అవసరం

సిద్దవటం: అటవీశాఖ చట్టాలపై గ్రామీణ ప్రజలు అవగాహన పెంచుకుని అధికారులకు సహకరించాలని సిద్దవటం అటవీశాఖ క్షేత్రాధికారి కళావతి తెలిపారు. సిద్దవటం మండలంలోని ఎస్.రాజంపేట, వంతాటిపల్లె, జ్యోతి గ్రామాల్లో శుక్రవారం అటవీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అటవీక్షేత్రాధికారి మాట్లాడుతూ ఎర్రచందనం, వన్యప్రాణుల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ప్రజలు అధికారులకు సహకరించాలన్నారు. ఉప అటవీక్షేత్రాధికారి ఓబులేసు, బీటు అధికారి పెంచలరెడ్డి పాల్గొన్నారు.



ఎస్.రాజంపేటలో గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీక్షేత్రాధికారిణి కళావతి

రిమ్స్‌లో అన్నదానం

కడప చిన్నచౌకు, న్యూస్‌టుడే: దసరా శరన్నరాత్రుల సందర్భంగా హిమ వర్షిణి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సుమారు 300 మందికి అన్నదానం చేశారు. నిర్వాహకులు రవి, సభ్యులు పురుషోత్తం, రెడ్డి లక్ష్మణ్, దామోదర్, రవి, మధు, అవినాష్ తదితరులున్నారు.



శునకం.. భయం... భయం...

కడప పాతబస్టాండులోని వంతెనపై కుక్కల బెడద స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. కుక్కలు గుంపులు గుంపులుగా అడ్డంగా పడుకుని ఉంటున్నాయి. వాటిని దాటుకుని వెళ్లాలంటే పాదచారులు భయపడుతున్నారు. నగరంలో పలుచోట్ల శునకాలు పెద్దసంఖ్యలో సంచరిస్తున్నాయి. వాహనదారుల వెంటపడుతున్నాయి. నగరపాలక అధికారులు వాటి పట్టివేతకు చర్యలు చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. **- న్యూస్‌టుడే, కడప చిన్నచౌకు**

బస్టాండులో పనిచేయని ఏటీఎంలు




జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండులో ఏటీఎంలు పనిచేయక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇతర ప్రాంతాల నుంచి వారు బస్టాండులో ఏటీఎం ఉంటుందనుకుని వస్తున్నారు. ఇక్కడ డబ్బులు రాక నగరంలోని ఇతర ఏటీఎంల వద్దకు పరుగులు పెట్టాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు ఏటీఎం తెరను పగలగొట్టారు. అధికారులు స్పందించి ఏటీఎంలను అందుబాటులోకి తీసుకురావాలని ప్రయాణికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కడప నేరవార్తలు

వేలాడుతున్న తీగలు... రక్షణ లేని నియంత్రికలు

న్యూస్‌టుడే, బిల్టప్

కడప నగరంలో పలుచోట్ల విద్యుత్తు తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతున్నాయి. చిన్నపాటి గాలి వీచినా ఒకదానికికొకటి రాసుకుని మంటలు రేగుతున్నాయి. శివారు ప్రాంతాలైన రామాంజనేయపురం, తిలక్ నగర్, ఇందిరానగర్, శ్రీరామ్‌నగర్ ప్రాంతాల్లో పలు చోట్ల స్తంభాలు ఒరిగిపోయి ఉన్నాయి. తిలక్‌నగర్‌లో నివాసాల మధ్య నియంత్రిక వద్ద రక్షణ ఏర్పాట్లు లేవు. పిల్లలు పొరపాటున తాకితే పెను ప్రమాదం వాటిల్లే అవకాశముంది. ఆర్కేనగర్‌లో నివాసాల మధ్యలో ఇదే పరిస్థితి. అధికారులు స్పందించి విద్యుత్తు తీగలు సరిచేసి, నియంత్రికల వద్ద కంచె ఏర్పాటు చేయాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై విద్యుత్తు ఏఈ శివరామిరెడ్డి మాట్లాడుతూ చేతికందే ఎత్తులో ఉన్న తీగలను, నియంత్రికలను సరిచేయడానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొన్ని చోట్ల గృహ యజమానులు విద్యుత్తు తీగల వరకు శ్లాబులు వేసి ప్రమాదాలు కొని తెచ్చుకుంటున్నారని, వారికి నోటీసులు ఇచ్చామని చెప్పారు.



నివాసాల మధ్య చేతికందే ఎత్తులో నియంత్రిక



నేలకొరిగిన విద్యుత్తు స్తంభం, వేలాడుతున్న తీగలు

అధికారులు చర్యలు చేపట్టాలి...

శంకరాపురంలో బార్ వెనుక వీధిలో తీగలు తక్కువ ఎత్తులో వేలాడుతున్నాయి. మరికొన్నిచోట్ల ఇళ్లకు వెళ్లే తీగలు గజిబిజిగా ఉండి, గాలి వీచినప్పుడు ఊగుతూ నిప్పురవ్వలు పడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో అని భయంగా ఉంది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి. **- వెంకట్, స్థానికుడు, కడప**

ప్రధానిపై విమర్శలు తగవు

చెన్నూరు, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ పేరుకే జాతీయ పార్టీ అని, వాస్తవంగా అది దేశద్రోహ పార్టీ అని మండల భాజపా ఉపాధ్యక్షుడు గణేష్ విమర్శించారు. చెన్నూరులో శుక్రవారం మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలకు ప్రధానమంత్రి మోదీని విమర్శించే స్థాయిలో లేదన్నారు. ఆయన నాయకత్వంలో ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయని కొనియాడారు. భాజపా నేతలు ముకుందారెడ్డి స్వామి, తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగాలేవి?

కడప భాగ్యనగర్ కాలనీ, న్యూస్‌టుడే: ఎన్నికలకు ముందు ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని హామీలు ఇచ్చిన భాజపా ఇప్పుడు పట్టించుకోవడం లేదని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సుమంత్ కుమార్ ఆరోపించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నౌక్రీ దో- నషా నహీ (డ్రగ్స్ వద్దు.. ఉద్యోగాలు ముద్దు) పోస్టర్లను ఆవిష్కరించారు. ఆది శివప్రసాద్, వంశీయాదవ్, సునీల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం

వేముల, న్యూస్‌టుడే: ఎన్నికల సమమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని నియోజకవర్గ కాంగ్రెసుపార్టీ సమన్వయకర్త ధృవకుమార్‌రెడ్డి విమర్శించారు. వేములలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వంలో చేపట్టి, నిలిచిపోయిన అభివృద్ధి పనులను పూర్తిచేసేందుకు నిధులను మంజూరుచేయాలని కోరారు. మాబు తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు సకాలంలో ఇవ్వాలి

మారుతీనగర్, న్యూస్‌టుడే: శనగ విత్తనాలకు రిజిస్ట్రేషన్ చేసుకుని వారం రోజులు కావస్తున్నా పంపిణీ చేయలేదని, సకాలంలో ఇవ్వకపోతే ఆందోళన చేయక తప్పదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి హెచ్చరించారు. స్థానిక జిల్లా కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ రైతులకు విత్తనాలు పంపిణీ చేయడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప: 8008573428, 8074174832
పులివెందుల : 8008573466
కమలాపురం : 8008573475

స్పందనకు వందనం

కడప ఐసీడీఎస్ కార్యాలయం వద్ద కొండలా చెత్త పేరుకుపోయిన వైనంపై 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన నగరపాలక సంస్థ అధికారులు చెత్తను తొలగించారు.
- న్యూస్‌టుడే, అరవిందనగర్ (కడప)

?: కడప నబీకోటలోని మూడు రోడ్ల మధ్య చెత్తాచెదారం వేస్తున్నారు. దుర్వాసన వస్తోంది. అధికారులు స్పందించి చెత్తను తొలగించాలి. **- కె.సుబ్బయ్య, కడప**

✓: నగరపాలక పారిశుద్ధ్య కార్మికులను పంపించి మూడు రోడ్ల కూడలి వద్ద ఉన్న చెత్తాచెదారాన్ని తొలగిస్తాం.
- చంద్రశేఖర్, వైద్యాధికారి నగరపాలక, కడప.

?: ఆర్టీసీ బస్టాండులో ఫ్యాన్లు వేయడం లేదు. దీంతో ప్రయాణికులు ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. **- రాజు, కడప**

✓: ఫ్యాన్లు వేసేలా చర్యలు తీసుకుంటాం. **- దిల్లేశ్వరరావు, డీఎం**

?: కడప రవీంద్రనగర్‌లోని కొన్ని వీధుల్లో ఇప్పటికీ నివాసాల వెనుక వైపు మురుగు కాలువల్లో సిబ్బంది శుభ్రం చేయడం లేదు. **- కృష్ణవేణి, రవీంద్రనగర్**

✓: కాలువలను శుభ్రం చేయించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- చంద్రశేఖర్, ఎంహెచ్‌వో - న్యూస్‌టుడే, చిన్నచౌకు**

?: నర్వకాటిపల్లెలో పశువుల దాహార్తి తీర్చడానికి గతంలో తాగునీటి తొట్టె పాచి పట్టి అపరిశుభ్రతగా ఉంది. దోమలకు ఆవాసమైంది. **- వెంకటసుబ్బమ్మ, నర్వకాటిపల్లె**

✓: తొట్టె చుట్టూ వృథా నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకొంటాం. **- చంద్ర, కార్యదర్శి, గ్రామ సచివాలయం, నర్వకాటిపల్లె**

?: ఒంటిమిట్ట కోదండరాముడి కల్యాణ వేదిక ముంగిట్లో రెండు వైపులా స్వాగత తోరణాల వద్ద ఏర్పాటు చేసిన సూచికలు వాలిపోయాయి. అధికారులు స్పందించి బాగు చేయించాలి. **- ఎం.చెన్నకేశవరెడ్డి, ఒంటిమిట్ట**

✓: సూచికలను బాగు చేయించి, యథాస్థానంలో ఉంచడానికి చర్యలు తీసుకొంటాం. **- కె.అమరనాథ్‌రెడ్డి, ఏఈ, తితిదే**
- న్యూస్‌టుడే, ఒంటిమిట్ట

?: కమలాపురం పోలీస్ లైన్ వీధికి వెళ్లే దారిలో రోడ్డు పక్కన చెత్త తొట్టి నిండి కిందపడిపోయి దుర్వాసన వ్యాపిస్తోంది.
- సుబ్బరాయుడు, కమలాపురం

✓: పారిశుద్ధ్య కార్మికులను పంపి చెత్తను తొలగిస్తాం.
- బాలనరసింహులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ - న్యూస్‌టుడే, కమలాపురం

?: లోపట్నూతలలో చిన్న గాలి వీచినా విద్యుత్తు సరఫరా గంటల తరబడి నిలిచిపోతోంది. అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. **- నారాయణ, లోపట్నూతల**

✓: సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం.
- రమేష్‌బాబు, విద్యుత్తు ఏఈ

?: పులివెందుల నుంచి పార్నపల్లె వరకు రెండు వరుసల రోడ్డు మలుపుల్లో ముళ్లకంపలు పెరిగిపోయాయి. దీంతో వాహనదారులు ప్రమాదాల బారినపడుతున్నారు. **- జిలానీ, వెలిదండ్ల**

✓: ముళ్లకంపలు తొలగించి సూచికలు కనిపించేలా చర్యలు తీసుకుంటాం. **- మనోహరరెడ్డి, ఆర్‌అండ్‌బీ ఏఈ, లింగాల**
- న్యూస్‌టుడే, లింగాల

?: వేల్పుల పంచాయతీ పరిధిలోని బెస్తవారిపల్లెలో కాలువల నుంచి మురుగు బయటకు వస్తుండటంతో దుర్వాసన వస్తోంది. **- రామక్రిష్ణ, బెస్తవారిపల్లె**

?: గొల్లలగూడూరులో మురుగునీరు బయటకు వదులుతుండడంతో వీధుల్లో ప్రవహిస్తోంది. దీంతో ఇబ్బందులు పడుతున్నాం. **- గంగిరెడ్డి, గొల్లలగూడూరు**

✓: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
- శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీవో - న్యూస్‌టుడే, వేముల